సాక్షి
కాకినాడ

బుధవారం | 23 | జూలై | 2025



అన్నదాన ట్రస్టుకు విరాళం


ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు పళ్లపోతు నాగేశ్వరరావు (పొదలాడ) సోమవారం రూ.25,016 విరాళం సమర్పించారు.



శ్రీకృష్ణ మందిర్ నిర్మాణానికి రూ.50 వేలు

అయినవిల్లి: నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన మోటూరి శ్రీరామ సత్యనారాయణమూర్తి తన భార్య జ్ఞాపకార్థం రూ.50 వేల విరాళం అందజేశారు.

కడలిలోకి 83 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 83,208 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2,100, పశ్చిమ డెల్టాకు 4,700 కలిపి మొత్తం 10,600 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

చిరంజీవిని కుమారికి దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఇటీవల మృతి చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి, ఐడియల్ కళాశాలల కరస్పాండెంట్ పి.చిరంజీవిని కుమారికి ఆలిండియా వుమెన్స్ కాన్ఫరెన్స్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డు ప్రకటించింది. ఈ నెల 26న ఐడియల్ కళాశాలలో జరిగే కార్యక్రమంలో చిరంజీవిని కుమారి కుటుంబ సభ్యులకు ప్రముఖ గైనకాలజిస్ట్ ఆలూరి విజయలక్ష్మి ఈ అవార్డు అందించనున్నారు.

నేటి నుంచి ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఐటీఐలలో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ బుధవారం నుంచి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్నారు. ఐటీఐ అడ్మిషన్ల కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు 1 నుంచి 225 వరకూ ర్యాంకుల వారికి, కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు 255 నుంచి 504 వరకూ ర్యాంకులు పొందిన వారికి నిర్వహిస్తామన్నారు. గురువారం ఉదయం 505 నుంచి 776 వరకూ, మధ్యాహ్నం 777 నుంచి 1,035 వరకూ ర్యాంకులు పొందిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వివరించారు. ఆయా సమయాల ప్రకారం అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, హాకీ పోటీలకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలి

కాకినాడ సిటీ: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, హాకీ టోర్నమెంట్ నిర్వహణకు అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాకినాడ క్రీడా మైదానం వేదికగా ఆగస్టు 1 నుంచి 12వ తేదీ వరకూ జాతీయ జూనియర్ మహిళల హాకీ పోటీలు, ఆగస్టు 3 నుంచి 20వ తేదీ వరకూ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనున్నాయని తెలిపారు. ఒకేచోట రెండు ప్రధాన కార్యక్రమాలు జరగనున్నందున బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ, టాయిలెట్లు, లైటింగ్, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్, షామియానాలు, రవాణా, భోజనం, వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలన్నారు. హాకీ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొంటాయని, ఏయే రాష్ట్రాల వారికి ఎక్కడెక్కడ వసతి కల్పిస్తున్నారో, అక్కడ చేయాల్సిన ఏర్పాట్లేమిటో అధికారులు స్పష్టమైన అవగాహనతో పని చేయాలని సూచించారు. రెండు కార్యక్రమాలకూ వేర్వేరుగా వైద్య బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ వెంకటరావు, సీపీఓ పి.త్రినాథ్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్, డీఎఫ్‌ఓ పీవీఎస్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

40 మందితో విపత్తుల స్పందన దళం

అమలాపురం టౌన్: స్థానిక సబ్ జైలు ప్రాంగణంలో 40 మంది సభ్యులతో విపత్తుల స్పందన దళానికి నివాసం ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీవో కొత్త మాధవి తెలిపారు. ప్రస్తుతం 27 మంది విపత్తుల విధులు నిర్వహించేందుకు వచ్చారని పేర్కొన్నారు. మిగిలిన సిబ్బంది త్వరలోనే విధులకు హాజరవుతారని చెప్పారు.

దారుణ మోసం!

- ఒక్క యూనిట్ ఇస్తే ఒట్టు
- ఊదరగొట్టి ఉసూరుమనిపించారు
- మూడు నెలలైనా దిక్కుమొక్కు లేదు
- సబ్సిడీపై చేతులెత్తేసిన సర్కార్



పెద్దాపురంలో కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు హాజరైన అర్జీదారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాయితీ రుణాలతో స్వయం ఉపాధికి పెద్దపీట వేస్తామని కూటమి సర్కార్ చెప్పిన మాటలు నీటిమీద రాతలుగానే మిగిలిపోయాయి. రూ.లక్ష, రూ.2 లక్షలు, రూ.3 లక్షలు రుణాలిస్తామని, సగం సబ్సిడీ అని, మిగిలిన సగం బ్యాంక్ రుణమని చంద్రబాబు, పవన్ కల్యాణ్ గొప్పగా డప్పేశారు. బీసీ, ఎస్సీ, కాపు సామాజికవర్గాలకు రుణాలో రుణాలంటూ దండోరా వేసి మరీ ప్రచారం చేశారు. మంత్రుల నుంచి ద్వితీయ శ్రేణి నేతల వరకూ చేసిన హంగామా అంతా ఇంతా కాదు. దరఖాస్తు చేసుకోవడమే తరువాయి అందరికీ సబ్సిడీ రుణాలంటూ ఊదరగొట్టారు. మాయ మాటలతో జనాన్ని నమ్మించి న చంద్రబాబు గద్దెనెక్కారు. తరువాత ఎప్పటి మాదిరిగానే నిలువునా ముంచేశారు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ రుణాలు రాకపోవడంతో.. స్వయం ఉపాధి పొందవచ్చని ఆశపడిన వారు హతాశులవుతున్నారు. అంతన్నారింతన్నారే చంద్రబాబు.. నట్టేట్లో ముంచేశారే.. అని మండిపడుతున్నారు.

లక్ష్యం మూరెడు.. దరఖాస్తులు బారెడు

బీసీ, ఎస్సీ, ఈబీసీ, కాపు సామాజికవర్గాల్లో అర్హులైన వారికి రాయితీ రుణాలిస్తామని సర్కారు ఊరూవాడా ఊదరగొట్టింది. తీరా ఆచరణలోకి వచ్చేసరికి రుణ లక్ష్యాలు వందల్లోనే ఇచ్చారు. ఒక నియోజకవర్గంలో అన్ని కార్పొరేషన్లు కలిపి సుమారు 100 యూనిట్లు కేటాయిస్తే అంతకు పది రెట్లు దరఖాస్తులు కూడా వచ్చాయి. ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం మార్చి 11న ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించింది. ఆ నెలంతా స్వీకరించడంతో వేలాదిగా దరఖాస్తులు వచ్చిపడ్డాయి. వాటిని ఏప్రిల్ నెలలో మండల స్థాయిలో వడబోసిన ఎంపీడీఓలు.. ఆయా బ్యాంకులకు పంపించారు. బ్యాంకులు కూడా రుణం ఇచ్చేందుకు ఆసక్తి చూపాయి. బ్యాంకుల నుంచి ఆమోదం లభించిన వారంతా శ్రావణ మాసం మంచి రోజుల్లో యూనిట్లు ప్రారంభిద్దామని గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. కానీ, వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు జల్లింది. మంజూరు చేసిన యూనిట్లకు, వచ్చిన దరఖాస్తులకు ఎక్కడా లంగరు అందకపోవడంతో ప్రభుత్వం మార్జిన్ మనీ విడుదల చేయకుండానే కార్పొరేషన్ రుణ ప్రక్రియను అప్పటికప్పుడు నిలిపివేసింది. ఈ రుణాలపై ముందుకు వెళ్లవద్దని మే 8న ఆదేశాలిచ్చింది. ఫలితంగా కార్పొరేషన్ రుణాల ప్రక్రియ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఒక్క యూనిట్ కూడా ఇప్పటి వరకూ మంజూరు కాలేదు. ఒక యూనిట్ విలువ రూ.2 లక్షలనుకుంటే అందులో 50 శాతం అంటే రూ.లక్ష ప్రభుత్వ సబ్సిడీ. మిగిలిన రూ.లక్ష బ్యాంకు రుణం. ఇస్తానన్న 50 శాతం సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేయకుండా మూడు నెలలుగా ముప్పుతిప్పలు పెడుతోంది. రుణాల పేరిట దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం ఎందుకు.. ఇప్పుడు తమ ఆశలను ఆడియాసలు చేయడం ఎందుకని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. రుణం ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకొచ్చినా ప్రభుత్వం కావాలనే సబ్సిడీ విడుదల చేయకుండా చివరి నిమిషంలో అర్ధాంతరంగా ఈ ప్రక్రియను నిలిపివేసిందని మండిపడుతున్నారు.

మూడు జిల్లాల్లో ఆయా కార్పొరేషన్ల వారీగా రుణాల వివరాలు

రుణాల కేటగిరీ	యూనిట్ల లక్ష్యం	రుణాల లక్ష్యం (రూ.లక్షలు)	దరఖాస్తుదార్లు	మంజూరు చేసిన యూనిట్లు	మొత్తం (రూ.కోట్లు)
కాకినాడ జిల్లా					
బీసీ కార్పొరేషన్	1,914	3,952.00	31,859	562	1,283.55
ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్	154	417.00	2,449	41	84.42
కాపు కార్పొరేషన్	763	2,824.00	21,454	238	5.93
తూర్పు గోదావరి జిల్లా					
బీసీ కార్పొరేషన్	1,374	2,887.00	16,408	234	5.22
ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్	203	540.00	2,211	20	0.54
కాపు కార్పొరేషన్	757	2,715.00	8,193	174	4.53
కోనసీమ జిల్లా					
బీసీ కార్పొరేషన్	1,394	2,954.00	15,147	246	5.87
ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్	154	417.00	1,657	12	0.24
కాపు కార్పొరేషన్	757	2,714.00	15,644	158	4.62

రుణాలివ్వకపోవడం అన్యాయం



కార్పొరేషన్ రుణాల పేరు చెప్పి, కాపులను ప్రభుత్వం దగా చేసింది. అందరికీ రుణాలని ఆశలు కల్పించి, తీరా యూనిట్ల మంజూరు సమయం వచ్చేసరికి చేతులెత్తేయడం చంద్రబాబు సర్కార్‌కు కొత్తేమీ కాదు. ప్రతి ఎన్నికల్లోనూ జనాన్ని ఇలానే నమ్మించి మోసం చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. సబ్సిడీ సొమ్ము విడుదల చేయలేనప్పుడు అంత హడావుడిగా రుణ ప్రణాళిక ప్రకటించడమెందుకు? రుణాల మంజూరు ప్రక్రియ మొదలై ఐదు నెలలైనా ఇంతవరకూ ఒక్కరంటే ఒక్కరికైనా రుణం మంజూరు చేసి ఉంటే చెప్పాలి.

– రావూరి వెంకటేశ్వరరావు,
వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం కార్యదర్శి, కాకినాడ

వెంటనే మంజూరు చేయాలి



కుటుంబ పోషణ కోసం వస్త్ర, కిరాణా దుకాణాలు పెట్టుకుందామని బీసీ కార్పొరేషన్ రుణానికి దరఖాస్తు చేసుకున్న వారు ఆ రుణం వస్తుందా అని కళ్లల్లో ఒత్తులు వేసుకుని మరీ ఎదురు చూస్తున్నారు. ఐదు నెలలు గడచినా ఇప్పటి వరకూ రుణం మంజూరు కాలేదు. అధికారులను అడిగితే లబ్ధిదారుల లిస్టు పంపామంటున్నారు. రుణాలు మంజూరైన జాబితాయే రాలేదనీ చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి త్వరితగతిన బీసీ రుణాలు మంజూరు చేయాలి.

– గుబ్బల వీర వెంకట సత్యనారాయణ,
వైఎస్సార్ సీపీ బీసీ విభాగం అధ్యక్షుడు, రాజోలు

అసలు ఇస్తారా?



ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) కార్పొరేషన్ రుణాలు వస్తాయని దరఖాస్తుదారులు మూడు నెలలుగా ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఇస్తామన్న రుణాలు రాక బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న వారే ఎక్కువగా కనిపిస్తున్నారు. రుణాలు వెంటనే మంజూరు చేయాలి. స్వయం ఉపాధికి అవకాశాలు మరింత పెంచాలి. రుణాలకు సంబంధించి సబ్సిడీ ప్రభుత్వం విడుదల చేయకుంటే బ్యాంకులు మాత్రం ఎలా రుణాలు ఇస్తాయి?

– దుర్వాసుల సత్యనారాయణ,
బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు, రాజమహేంద్రవరం

ఆశలు ఆవిరి



ప్రభుత్వం రాయితీ రుణాలిస్తుందని ఆశపడి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. మండల స్థాయిలో జాబితాలపై పరిశీలన జరిపి, బ్యాంకుకు వెళ్లేసరికి ప్రభుత్వం రాయితీ సొమ్ము విడుదల చేయలేదని సమాధానం చెబుతున్నారు. సర్కారు ఉదాసీనత కారణంగా ఐదు నెలలుగా ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదు. అసలు రుణాలిస్తారో ఇవ్వరో అర్థం కావడం లేదు.

– వేట్ల నాగేశ్వరరావు,
మైనార్టీ బీసీ సంఘం అధ్యక్షుడు, రామచంద్రపురం

రత్నగిరి ఆలయాల్లో నేతి వాడకంపై తనిఖీలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం, యంత్రాలయం, రామాలయం, వనదుర్గ, కనకదుర్గ ఆలయాలకు దేవస్థానం ప్రతి నెలా అందజేస్తున్న ఆవు నెయ్యి వినియోగంపై ఇక నుంచి తనిఖీలు నిర్వహించనున్నట్లు అన్నవరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు మంగళవారం తెలిపారు. రత్నగిరి తొలి పావంచా వద్ద కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఉప ప్రధానార్చకునిగా పని చేస్తున్న చిట్టెం వీఎస్ఎస్ హరగోపాల్ 45 కిలోల ఆవు నెయ్యి కారులో పట్టుకుపోతూ గత గురువారం పట్టుబడ్డారు. అతడితో పాటు అతడికి సహకరించిన సంభావన పరిచారకుడు ఎస్ఎస్ సుబ్రహ్మణ్య కృష్ణకుమార్‌ను కూడా విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఈఓ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. దీనిపై దేవదాయ శాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పించగా.. అన్ని ఆలయాల్లోనూ నేతి వినియోగంపై కూడా తనిఖీలు చేయాలని ఆదేశించారు. గత నెల రోజుల్లో ఇదేవిధంగా నెయ్యి పట్టుకుపోయిన వైదిక సిబ్బంది ఎవరైనా ఉన్నారా అనే అనుమానంతో మిగిలిన ఆలయాల వద్ద సీసీ టీవీ ఫుటేజీలు కూడా తనిఖీ చేస్తామని ఈఓ తెలిపారు.

రామాలయం వద్ద మళ్లీ పారాయణ

రత్నగిరి రామాలయం వద్ద రెండేళ్లుగా రామ పారాయణ జరగడం లేదు. అక్కడి పారాయణదారు మృతి చెందడంతో కొత్తగా ఎవరినీ నియమించలేదు. ఈ విషయాన్ని ఈఓ దృష్టికి తీసుకురాగా త్వరలోనే అక్కడ పారాయణదారును నియమిస్తామని, అంతవరకూ వ్రత పురోహితునితో పారాయణ నిర్వహించే ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం రత్నగిరిపై నిత్యాగ్నిహోత్రం చేస్తున్న దేవస్థానం వైదిక పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ అనారోగ్యంతో బాధ పడుతున్నందున ఆ పదవికి రాజీనామా చేశారని, ఆయన స్థానంలో కూడా వ్రత పురోహితుడిని నియమిస్తామని తెలిపారు.

ఇదేం భోజనం.. ఇవేం సౌకర్యాలు?

హాస్టల్‌లో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి తనిఖీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి స్థానిక ఆర్ట్స్ కాలేజీ సమీపంలోని గిరిజన సంక్షేమ బాలురు, బాలికల హాస్టల్‌ను, బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను మంగళవారం సందర్శించారు. హాస్టళ్లలో వసతులు, ఆహారాన్ని పరిశీలించారు. వసతి గృహం సిబ్బందితో మాట్లాడారు. గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్‌లో వసతులు, శుభ్రత విషయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్ కిటికీలకు దోమ తెరలు



గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న శ్రీలక్ష్మి

లేవని, బాత్ రూములకు డోర్లు లేవని, భోజనం చేసే స్థలం శుభ్రంగా లేదని, భోజనం బాగోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటిని వెంటనే మెరుగు పరచాలని సూచించారు. విద్యార్థులకు సురక్షిత తాగునీరు, మంచి ఆహారం అందించాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వసతి గృహ ప్రాంగణంలో అవసరమైన మరమ్మతులు ఎప్పటికప్పుడు చేయించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి వైద్య సహాయం అవసరమైనా వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. వసతి గృహంలో ఎటువంటి సమస్యలున్నా, న్యాయ సహాయం కావాలన్నా డీఎల్ఎస్ఏకి తెలియజేయాలని శ్రీలక్ష్మి సూచించారు. డీఎల్ఎస్ఏ అందిస్తున్న సేవలను వివరించారు.

శానిటేషన్ కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు

- రూ.30 లక్షల నకిలీ రశీదులు ఇచ్చి మోసం చేశారని ఫిర్యాదు
- అన్నవరం దేవస్థానం ఈఓ వెల్లడి

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: ప్రావిడెంట్ ఫండ్ చెల్లించినట్టుగా రూ.30 లక్షలకు నకిలీ చలానాలు ఇచ్చి మోసం చేశారంటూ విజయవాడకు చెందిన కనకదుర్గా మ్యాన్‌పవర్ సర్వీసెస్ శానిటేషన్ కాంట్రాక్టర్‌పై అన్నవరం దేవస్థానం అధికారులు మంగళవారం రాత్రి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ఈ విషయం తెలిపారు. దేవస్థానంలో ఎటువంటి డిపాజిట్ లేకుండా నామినేషన్ మీద ఆ సంస్థకు నెలకు రూ.59 లక్షలు చెల్లించేలా శానిటేషన్ కాంట్రాక్ట్ అప్పగించిన విషయం విదితమే. మార్చి, ఏప్రిల్, మే నెలలకు గాను 350 మంది సిబ్బందికి రూ.30 లక్షల పీఎఫ్ చెల్లించినట్లు దేవస్థానానికి ఆ కాంట్రాక్టర్ ఫేక్ రశీదులు ఇచ్చి రూ.1.77 కోట్ల బిల్లులు చేయించుకున్నారు. దీనిపై 'అన్నవరంలో శానిటరీ కాంట్రాక్టర్ మోసం' శీర్షికన ఈ నెల 17న 'సాక్షి' వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ వ్యవహారంపై విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గత మూడు రోజులుగా అన్ని వివరాలూ సేకరించిన దేవస్థానం అధికారులు కూలంకషంగా నివేదిక తయారు చేసి పంపించారు. నకిలీ పీఎఫ్ చలానా బాగోతంపై దేవస్థానం న్యాయవాదిని ఈఓ వీర్ల సుబ్బారావు, శానిటరీ విభాగ అధికారులు కలిసి న్యాయపరమైన సలహా అడిగారు. మార్చి నెలలోనే తమ ఖాతాల్లో పీఎఫ్ జమ చేయనందున అప్పుడే సిబ్బంది ఆ కాంట్రాక్టర్‌కు ఆ విషయం తెలియజేయాలని, అతడి నుంచి ఎటువంటి సమాధానం రాకపోతే దేవస్థానానికి ఆ విషయం లిఖితపూర్వకంగా తెలియజేయాలని, అప్పుడు మాత్రమే దేవస్థానానికి దీనిపై ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందని న్యాయవాది చెప్పారు. ఈ నేపథ్యంలో దేవస్థానం అధికారులు శానిటేషన్ సిబ్బందితో తమ ఖాతాల్లో జీతం తప్ప, పీఎఫ్ జమ కాలేదంటూ లేఖలు రాయించి, సంతకాలు తీసుకున్నారు. ఫేక్ చలానాలపై పీఎఫ్ అధికారులతో దేవస్థానం సిబ్బంది రాజమహేంద్రవరంలో మంగళవారం సమావేశమయ్యారు. వారి సూచనల మేరకు దేవస్థానం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫేక్ పీఎఫ్ చలానాల బాగోతంపై తమకు ఫిర్యాదు అందిందని అన్నవరం ఎస్సై హరిబాబు చెప్పారు. వివరాలు పరిశీలించి, వర్తించే సెక్షన్లు గుర్తించి, కేసు నమోదు చేస్తామని, అనంతరం ఆ కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

త్వరలో కొత్త ట్రస్ట్ బోర్డు!

- అన్నవరం దేవస్థానానికి నెలాఖరులోగా నియమించనున్న సర్కారు!
- 25 మంది పేర్లతో మంత్రులు, ఎమ్మెల్యేల ప్రతిపాదనలు
- కొత్త ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా ఐవీ రోహిత్.. మరో 17 మంది సభ్యులు
- 13 పదవులు టీడీపీకే..
- జనసేన, బీజేపీకి చెరో రెండింటితో సరిపెట్టాలని యోచన



అన్నవరం దేవస్థానం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో నూతన ధర్మకర్తల మండలి(ట్రస్ట్ బోర్డు)ని ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023లో ఏర్పాటు చేసిన ట్రస్ట్ బోర్డు కాలపరిమితి గత ఫిబ్రవరి 8న ముగిసింది. అప్పటి నుంచీ దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త, ఆలయ ఛైర్మన్ ఐవీ రోహిత్ ట్రస్ట్ బోర్డు తరఫున అధికారులతో సమావేశమై తీర్మానాలు చేస్తున్నారు. ఈ నెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుంది. మంచి ముహూర్తాలు ఉండటంతో ఆ మాసంలోనే ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం జరిగేలా ఏర్పాటు చేయనున్నారని సమాచారం. రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవస్థానాలకు ఈ నెల 19వ తేదీకల్లా ధర్మకర్తల మండళ్లను ఏర్పాటు చేయాలని, అందుకు పేర్లు పంపించాలని ఆయా ఆలయాల పరిధిలోని ఎమ్మెల్యేలను ప్రభుత్వం ఇప్పటికే కోరింది. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆశావహుల పేర్లను ప్రతిపాదించారు. దీనిపై ప్రభుత్వ వడపోత ముగింపు దశకు చేరుకుంది. ఈ నెలాఖరులోగా కొత్త ట్రస్ట్ బోర్డు ఏర్పాటయ్యే అవకాశాలున్నాయని సమాచారం.

గతంలో అన్ని వర్గాలకూ ప్రాధాన్యం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023లో 16 మందితో ఏర్పాటు చేసిన ట్రస్ట్ బోర్డులో అన్ని సామాజిక వర్గాలకూ ప్రాధాన్యం కల్పించారు. మొత్తం 15 మంది సభ్యుల్లో ఏడుగురు మహిళలు కాగా, మిగిలిన ఎనిమిది మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారే కావడం విశేషం. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారికి కూడా ట్రస్ట్ బోర్డులో స్థానం కల్పించారు. అన్ని వర్గాలకూ ప్రాధాన్యం కల్పించినదిగా ఈ ట్రస్ట్ బోర్డు దేవస్థానం చరిత్రలో నిలిచిపోయింది.

ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా ఇదే విధమైన ఫార్ములాతో ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. కొత్త ట్రస్ట్ బోర్డులో ఛైర్మన్‌తో పాటు మరో 17 మంది సభ్యులుంటారని తెలుస్తోంది. దేవదాయ శాఖ చట్టం ప్రకారం నూతన ట్రస్ట్ బోర్డుకు కూడా దేవస్థానం వ్యవస్థాపక కుటుంబానికి చెందిన ఐవీ రోహిత్ ఛైర్మన్‌గా నియమితులవ్వనున్నారు. మొత్తం సభ్యుల్లో నలుగురు లేదా ఐదుగురు మాత్రమే మహిళలుంటారని చెబుతున్నారు. అన్ని సామాజికవర్గాలతో పాటు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి కూడా ట్రస్ట్ బోర్డులో స్థానం కల్పించనున్నట్లు సమాచారం. నాయీబ్రాహ్మణ వర్గాల నుంచి కూడా ఒకరిని నియమించనున్నారు. అలాగే, దేవస్థానం తరఫున ఆలయ ప్రధానార్చకుడు ప్రత్యేక ఆహ్వానితునిగా ఉంటారు.

జనసేన 'పంచాయితీ'

ట్రస్ట్ బోర్డు నియామకంలో పిఠాపురం నియోజకవర్గం నుంచి సోషల్ మీడియాలో జనసేన తరఫున పిఠాపురం రూరల్ మండలానికి చెందిన ఒక వ్యక్తి పేరు ప్రతిపాదించారు. అతడు సోషల్ మీడియాలో వైఎస్సార్ సీపీతో పాటు అక్కడి టీడీపీ, జనసేనలోని ఒక వర్గం నాయకుల మీద అసభ్యకరమైన పోస్టులు పెట్టారు. దీనిపై టీడీపీ నియోజకవర్గ నాయకునితో పాటు జనసేనలోని కొంత మంది కూడా అతడిని హెచ్చరించారు. అయినా అతడి తీరు మారలేదని సమాచారం. ఇప్పుడు ధర్మకర్తల మండలికి అతడి పేరు ఏవిధంగా సిఫారసు చేస్తారని జనసేనలోని మరో వర్గం సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. కాగా, టీడీపీ నుంచి కూడా ట్రస్ట్ బోర్డులో ఒకరిని నియమించాలని టీడీపీ పిఠాపురం నియోజకవర్గ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు లేఖలు రాసినట్లు చెబుతున్నారు. ట్రస్ట్ బోర్డు సభ్యుల పేర్లు బయటకు వస్తే మిగిలిన నియోజకవర్గాల నుంచి కూడా ఇటువంటి వివాదాలు ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఈ నియోజకవర్గాల నుంచే..

- అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు పదవుల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పటికే 25 పేర్లు సిఫారసు చేసినట్లు సమాచారం.
- జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం, కాకినాడ రూరల్ నుంచి ఆ పార్టీ తరఫున ఒక్కొక్కరిని ట్రస్ట్ బోర్డులో నియమించనున్నారు.
- అలాగే, బీజేపీ తరఫున రాజమహేంద్రవరం, ప్రత్తిపాడు నుంచి ఒకొక్కరిని మాత్రమే ట్రస్ట్ బోర్డులో నియమించనున్నారు.
- మిగిలిన 13 మందినీ టీడీపీ నుంచే ఎంపిక చేస్తారని సమాచారం.
- పెద్దాపురం నుంచి శ్రీ లలితా ఇండస్ట్రీ అధినేత మట్టే సత్యప్రసాద్‌ను రెండోసారి కూడా దాత కోటాలో టీడీపీ ప్రజాప్రతినిధి సిఫారసు చేసినట్లు సమాచారం. గతంలో 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో కూడా ఆయనను దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యునిగా నియమించారు. ఆ తరువాత సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు సత్యప్రసాద్ దంపతులు రూ. 2.5 కోట్లతో వజ్ర కిరీటాలు చేయించారు. ఇటీవల అమ్మవారికి రూ.20 లక్షల విలువైన వజ్రాల హారాన్ని ఆయన కుమారుడు మట్టే ఆదిశంకర్ దంపతులు సమర్పించారు. వీటితో పాటు రూ.5 కోట్ల వ్యయంతో సత్యదేవుని ప్రసాద తయారీ భవనం, మరో రూ.2 కోట్ల విలువైన పూజాసామగ్రి సమర్పించారు. పలు భవనాలు కూడా నిర్మించారు.
- తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, కాకినాడ సిటీ, పాయకరావుపేట ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన వారికి ధర్మకర్తల మండలిలో చోటు దక్కే అవకాశం ఉంది.
- కోనసీమ నుంచి ఒకరు, మిగిలిన ఇద్దరూ గుంటూరు, విశాఖకు చెందిన వారు ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు.
- టీడీపీ నేతల నుంచి ఒత్తిళ్లు అధికమైతే మాత్రం జనసేన, బీజేపీల నుంచి ఒక్కొక్కరికి మాత్రమే చాన్స్ ఇస్తారు. టీడీపీ నుంచి మరో ఇద్దరిని నియమిస్తారు.

క్లుప్తంగా

ముద్రగడ క్షేమంగానే ఉన్నారు

ముద్రగడ పెద్ద కుమారుడు వీర్రాఘవరావు


వీర్రాఘవరావు

కిర్లంపూడి: మాజీ మంత్రి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సభ్యులు ముద్రగడ పద్మనాభం క్షేమంగా ఉన్నారని ఆయన పెద్ద కుమారుడు వీర్రాఘవరావు (బాలు)తెలిపారు. ముద్రగడ ఇటీవల అస్వస్థతకు గురికాగా హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించిన విషయం విదితమే. ముద్రగడ పద్మనాభం ఆరోగ్యానికేమి ఢోకా లేదని, ఆయన క్షేమంగా ఉన్నారని ఆయన పెద్ద కుమారుడు వీర్రాఘవరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యుల పర్యవేక్షణలో ఐసీయూలో ఉండడంతో తన తండ్రి వద్దకు ఎవరినీ అనుమతించడం లేదన్నారు. ప్రజల ఆశీస్సులతో ఆయన క్షేమంగా తిరిగి వస్తారని దయచేసి ఎవరూ ఆసుపత్రికి వెళ్లొద్దని వీర్రాఘవరావు కోరారు.

విద్యతోపాటు క్రీడలూ అవసరమే


బెలూన్లు వదిలి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న వీసీ డాక్టర్ చంద్రశేఖర్

రాజానగరం: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని, వాటికి కూడా తగిన సమయాన్ని కేటాయించి, క్రీడలలోనూ మంచి ప్రతిభను చాటాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి. చంద్రశేఖర్ అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో యూనివర్సిటీ స్థాయిలో మూడు రోజులపాటు జరిగే 25 వ వుమెన్ స్పోర్ట్సు మీట్‌ని మంగళవారం గాలిలోకి బెలూన్స్‌ని వదిలి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. 24 మెడికల్ అండ్ డెంటల్ కళాశాలల నుంచి 567 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొంటున్నారని యూనివర్సిటీ స్పోర్ట్సు క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఈ. త్రిమూర్తి తెలిపారు. వాలీబాల్, త్రోబాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బాడ్మింటన్, చెస్ వంటి ఆటలలో ఈ పోటీలు జరుగుతున్నాయని జీఎస్ఎల్ మెడికల్ కాలేజ్ పీడీ శ్రీనివాసరావు చెప్పారు. జీఎస్ఎల్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ మిత్రా, సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంకకు చెందిన పోలిన వెంకట్రావు (70) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకట్రావు అనారోగ్యం బారిన పడ్డారు. ఆ బాధ తట్టుకోలేక సోమవారం రాత్రి 9 గంటలకు ఇంటి వద్ద పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకట్రావు మంగళవారం ఉదయం 9 గంటలకు మరణించారు. ఆసుపత్రి సమాచారం, మృతుని కుమారుడు పోలిన వీరవెంకట సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు

బ్రాండ్ బాజా!

- బ్రూవరీస్ కార్పొరేషన్ నిర్వాకం
- బ్రాండు ఒకటే.. ధరలే వేరు
- మద్యం వ్యాపారుల సరికొత్త దోపిడీ
- అందుబాటులో లేని రూ.99 మద్యం

జిల్లా పేరు	మద్యం దుకాణాలు	గీత కార్మికుల షాపులు	మొత్తం
కోనసీమ	133	13	146
తూర్పు గోదావరి	125	12	137
కాకినాడ	155	15	170


మద్యం దుకాణంలో ఏర్పాటు చేసిన రకరకాల బ్రాండ్లు



ఒకే బ్రాండుపై ముద్రించిన మూడు ధరలు


అందుబాటులోని లేని రూ.99 మద్యం

ఆలమూరు: బ్రూవరీస్ కార్పొరేషన్ చేస్తున్న మద్యం సరఫరా, ధరల నిర్ధారణ ఒక ప్రహసనంలా మారుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అండతో మద్యం సిండికేట్లు కుమ్మక్కై మద్యం ప్రియుల బలహీనతలను ఆసరాగా తీసుకుని వారిని అనేక రూపాల్లో దోచుకుంటున్నారు. ఒకే మద్యం బ్రాండును ఒకే ధరకు విక్రయించవలసి ఉన్నా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. బ్రాండు ఒకటే అయినా ధర మాత్రం వేర్వేరుగా ముద్రించి వసూలు చేయడం ద్వారా ప్రజలను ప్రభుత్వం దోచుకుంటోంది. దీంతో మద్యం కొనుగోలుదారుల్లో మద్యం ధరలపై అయోమయం నెలకొంటోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనున్న 453 మద్యం దుకాణాలకు అమలాపురం, రాజమహేంద్రవరం, సామర్లకోట బ్రూవరీస్ కార్పొరేషన్ డిపోల నుంచి మద్యం సరఫరా జరుగుతుంది. మద్యం షాపుల స్థాయిని బట్టి 20 నుంచి 30 రకాల చీప్ లిక్కర్ నుంచి ప్రీమియం క్వాలిటీ వరకూ అందుబాటులో ఉంటున్నాయి.

ఇటీవల జిల్లాలోని పలు మండలాల్లో చీప్ లిక్కర్ బ్రాండు అయిన 9 సీ హార్స్ కంపెనీ క్వార్టర్ మద్యం బాటిల్ ధర రూ.120గా ఉంది. అయితే గత ఏడాది నవంబర్‌లో తయారు చేసిన 179 బ్యాచ్ బాటిళ్లలో మూడు ఎంఆర్‌పీ ధరలు ఉండటం వినియోగదారులను నివ్వెర పరుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.99 ధర కలిగిన మద్యం బాటిళ్లు ఎక్కడా దొరకని పరిస్థితి ఏర్పడింది. ఈ చీప్ లిక్కర్‌ను ఐదు కంపెనీలు సరఫరా చేస్తున్నా పూర్తిస్థాయిలో మద్యం కొనుగోలుదారులకు అందుబాటులో ఉండటం లేదు.

ఇదో రకం దోపిడీ

ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మద్యం షాపుల వద్ద ఒక్కొక్క చోట ఒక్కొక్క ధర ముద్రించి దోచుకుంటున్నారని మద్యం కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. 9సీ హార్స్ బ్రాండుకు చెందిన క్వార్టర్ బాటిల్ ధర రూ.120గా ఉంది. అయితే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని మద్యం షాపుల్లో ఒక్కొక్క చోట ఒక్కో విధంగా రూ.120. రూ.130, రూ.140 ధరలు ముద్రించి ఉన్నట్లు బాటిళ్లను చూస్తే తెలుస్తోంది. ఈ ధరలు మద్యం విక్రయదారులు ముద్రించారా లేదా బ్రూవరీస్ కార్పొరేషన్ ముద్రించి అమ్మకాలు కొనసాగిస్తోందా అనే సందేహం కలుగుతోంది. ఈ ధరల తేడా వల్ల మద్యం కొనుగోలుదారులు సుమారు రూ.ఐదు లక్షల వరకూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నష్టపోవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. చీప్ లిక్కర్ ధరలను ప్రాంతానికి ఒక్కో విధంగా నిర్ణయించి ప్రజలతో చెలగాటం ఆడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మద్యం దుకాణాల వద్ద విధిగా ఏర్పాటు చేయాల్సిన మద్యం ధరల పట్టిక కాని, స్టాకు వివరాలు కాని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఏర్పాటు చేయకపోవడం పరిస్థితికి అద్దం పడుతుంది. ఎంఆర్‌పీలో తేడా ప్రస్తుతం ఒక బ్రాండు కేనా మిగిలిన బ్రాండులపై కూడా తేడాగా ముద్రిస్తున్నారా అనే అనుమానం కలుగుతోంది.

కనిపించని రూ.99 మద్యం

మద్యం షాపుల్లో పేదలకు అందుబాటులో ఉండే విధంగా నాణ్యమైన మద్యాన్ని రూ.99 కే విక్రయిస్తామన్న కూటమి నాయకుల ఎన్నికల హామీ బుట్టదాఖలైంది. బ్రూవరీస్ కార్పొరేషన్ నుంచి రేషన్ పద్ధతిలో వారానికి దుకాణానికి మూడు మద్యం కేసులకు మించి సరఫరా చేయడం లేదని తెలుస్తోంది. అలాగే రూ.99 మద్యం బాటిల్‌కు కమీషన్‌ను పూర్తిగా తగ్గించడంతో విక్రయదారులు కూడా ఆ బ్రాండ్లను అమ్మడానికి ఇష్టపడటం లేదని మద్యం ప్రియులు చెబుతున్నారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్యాయత్నం

- చెరువులో దూకిన వారిని కాపాడిన స్థానికులు
- పురుగులు మందు కూడా తాగినట్టు పోలీసుల వెల్లడి
- సంతానం పట్టించుకోకపోవడమే కారణం?


స్థానికులు రక్షించడంతో ఒడ్డున పడ్డ వృద్ధ దంపతులు

జగ్గంపేట: జీవిత చరమాంకంలో కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవనం సాగించవలిసిన వృద్ధ దంపతులు జీవితంపై విరక్తితో పురుగు మందు తాగి, చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జగ్గంపేట శివారు సీతానగరం గ్రామం వద్ద చోటు చేసుకుంది. అయితే స్థానికులు ఘటన జరిగిన వెంటనే స్పందించి వృద్ధ దంపతులను కాపాడి జగ్గంపేటలోని సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అందించిన వివరాల ప్రకారం తొండంగి మండలం ఏవీ నగరం గ్రామానికి చెందిన 70 ఏళ్ల సక్కుల సత్యనారాయణ, 65 ఏళ్ల సక్కుల మంగతాయారు దంపతులు. సత్యనారాయణ పెద్దాపురంలో శ్రీ చక్ర హాస్పిటల్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. సంతానం ఈ దంపతుల మంచి చెడ్డలు పట్టించుకోకపోవడంతో జీవితంపై విరక్తి చెందినట్టు భావిస్తున్నామన్నారు. దీంతో మంగళవారం జగ్గంపేట శివారు సీతానగరం గ్రామం వద్ద చెరువు వద్దకు చేరుకుని పురుగు మందు సేవించి ఆత్మహత్య చేసుకోవడానికి చెరువులో దూకారు. అయితే అక్కడ వున్న స్థానికులు దీన్ని గమనించి వారిని రక్షించి చెరువు గట్టుపై పడుకోబెట్టి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని జగ్గంపేట సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

పాలెం సర్పంచ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి


కడియం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కిరణ్‌కుమార్ తదితరులు

కడియం: తమకు ప్రభుత్వం కేటాయించిన భూములను అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్న మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని జేగురుపాడు ఎస్సీ ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు సాకా కిరణ్ కుమార్, మాజీ అధ్యక్షుడు బళ్ల అన్నవరం, మద్దుకూరి సూరిబాబు, మోటిక మునియ్య మంగళవారం కడియం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వివరాలను కిరణ్‌కుమార్ విలేకరులకు తెలిపారు. 1977లో జేగురుపాడు గ్రామానికి చెందిన దళితులకు సర్వే నం.10లో 5.58 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. సర్వే నం.84, 86లో సుమారు పది ఎకరాల భూమిని మాధవరాయుడుపాలెం దళితులకు కూడా ఇచ్చిందన్నారు. ఆ భూమిలో దళితులు వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. ఇటీవల పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి దళితుల భూమిని కబ్జా చేయాలనే ఆలోచనతో తన అనుచరులతో గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. 52 ఏళ్లుగా తమ అధీనంలో ఉన్న భూమిని కబ్జా చేస్తారన్న భయంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శిలా విగ్రహాన్ని అక్కడ ఏర్పాటు చేయడంతో పాటు, చేపల చెరువును కూడా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. తన రాజకీయ పలుకుబడితో రెవెన్యూ, పోలీసు అధికారులను అడ్డు పెట్టుకుని తాము ఏర్పాటు చేసుకున్న విగ్రహాన్ని, దిమ్మెను దౌర్జన్యంగా తొలగించారన్నారు. అందువల్ల చంటిపైనా, అతనికి సహకరించిన వారిపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం ప్రకారం అరెస్టు చేయాలని కోరారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,500
గటగట (వెయ్యి)	27,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	25,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

విద్యార్థి దుర్మరణం

కరప: కాకినాడ కళాశాలకు మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఒక విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కరప మండలం వేళంగి శివారు కొప్పిశెట్టివారి వీధికి చెందిన కోసూరి సుబ్రహ్మణ్యం రెండో కుమారుడు కోసూరి వెంకటేష్(22) కాకినాడలోని ఒక ప్రైవేటు కళాశాలలో బీబీఏ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. అతను మంగళవారం మోటార్ సైకిల్‌పై కళాశాలకు వెళుతుండగా వేళంగిలోని దళమ్మచెరువుగట్టు ప్రాంతానికి వెళ్లేసరికి కాకినాడ వైపు నుంచి ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేష్ తలకు బలమైన గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న తండ్రి సుబ్రహ్మణ్యం అతనిని కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్సకోసం తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలుష్య కారక పరిశ్రమలను రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అరుణోదయ విమలక్క


పిఠాపురంలో ప్రదర్శన నిర్వహించిన ఏఐఎఫ్టీయూ నాయకులు

అరుణోదయ విమలక్క డిమాండ్

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో తీర ప్రాంత మత్స్యకారులను రోడ్డున పడేసే కాలుష్య కారక పరిశ్రమలు నిలిపివేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉభయ రాష్ట్రాల చైర్‌పర్సన్ విమలక్క విజ్ఞప్తి చేశారు. అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏఐఎఫ్టీయూ 34వ వార్షికోత్సవం సందర్భంగా మహాసభ మంగళవారం స్థానిక సూర్యరాయ గ్రంథాలయం ప్రాంగణంలో నిర్వహించారు. తొలుత ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సభాస్థలి వరకు కార్మికులు ఎరజెండాల చేతబట్టి ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి విమలక్క పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐఎఫ్టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆమె ప్రసంగించారు. తీర ప్రాంతంలో పలు విషతుల్యమైన పరిశ్రమల వలన వాతావరణ సమతుల్యం దెబ్బతింటోందన్నారు. దీనివల్ల తీర ప్రాంతంలో హేచరీస్ కనుమరుగైపోతాయని, అనేకమంది ఉపాధి దెబ్బతింటుందన్నారు. ప్రధాన వక్త ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికలలో హామీ ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజలను నయవంచన చేస్తోందని విమర్శించారు.

అదానీకి లబ్ధి చేకూర్చడం కోసం స్మార్ట్ మీటర్లను బలవంతంగా అమరుస్తున్నారని విమర్శించారు. ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీం బాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కరోనా కాలంలో 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదిస్తూ చట్టం చేసిందని, దాన్ని అమలు చేయడం కోసం ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ఏఐఎఫ్టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గొల్ల అంజయ్య, ఏపీ ఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి రమేష్, ఏపీఆర్సీఎస్ సీనియర్ నాయకులు కొండ దుర్గారావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి సుధాకర్, తెలంగాణ అధ్యక్షుడు మల్సూర్, ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) కన్వీనర్ డొక్కులూరి సంగీత పాల్గొన్నారు.

గుళికలు చల్లిన వ్యవసాయ కూలీలకు అస్వస్థత

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి వరి చేలో ఫెర్టిలైజర్ మందు గుళికలు చల్లే సమయంలో నలుగురు వ్యవసాయ కూలీలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన నందిగ రాజు, గెడ్డం సత్యానందం, కాడెల్లి గంగరాజు, గరిసికూటి ముత్యాలరావు గుళికలు చల్లే సమయంలో మందు పవర్ ఎక్కువ కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. వారు అక్కడ చికిత్స పొందుతున్నారు.

యువతి అదృశ్యంపై కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన యువతి తానేటి శైలజ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎల్. బాలాజీ సుందరరావు మంగళవారం తెలిపారు. గోపవరం గ్రామానికి చెందిన తానేటి శ్రీను కుమార్తె శైలజ ఈ నెల 21వ తేదీ రాత్రి 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

నిడదవోలులో చోరీ


దుండగులు తెరిచిన బీరువా ఇదే

నిడదవోలు: పట్టణంలోని సంజీవయ్యనగర్‌లో సోమవారం రాత్రి దొంగలు పడి దొరికిన కాడికి దోచుకుపోయారు. గొట్టుముక్కల నాగేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో ఈ నెల 19న హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి తిరిగి ఇంటికి వచ్చాక చోరీ జరిగినట్లు గుర్తించారు. దుండగులు ముందుగా ప్రధాన ద్వారానికి వేసిన తాళం పెకిలించి ఇంట్లోకి ప్రవేశించారు. గదిలో బీరువా తెరచి లాకర్‌లో దాచుకున్న రెండు కాసుల బంగారు వస్తువులు, రూ.లక్ష నగదును అపహరించారు. ఇంటి యజమాని నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



మృతుడు చంద్రశేఖర్ (ఫైల్)

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిపై మడికి వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ వెంపల చంద్రశేఖర్ (50) మృతి చెందాడు. ఆలమూరు పోలీసుల కథనం ప్రకారం అయినవిల్లి మండలంలోని ముక్కామల సమీపంలోని ఇరుసుమండకు చెందిన చంద్రశేఖర్ తన వ్యాన్‌పై సమీపంలోని కొత్తపేట నుంచి లోడు వేసుకుని రాజమహేంద్రవరం బయలుదేరాడు. రావులపాలెం వచ్చేసరికి ఒక ప్రయాణికుడిని తన వాహనంలో ఎక్కించుకున్నాడు. స్థానిక అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్ వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా అందులో ప్రయాణిస్తున్న వ్యక్తి వ్యాన్ క్యాబిన్‌లో చిక్కుకున్నాడు. దీంతో ఆ ప్రయాణికుడిని బయటకు తీసేందుకు పోలీసు, హైవే సిబ్బంది రెండుగంటల పాటు శ్రమించారు. అప్పటికే తీవ్ర గాయాలతో ఉన్న అతన్ని ఎన్‌హెచ్ అంబులెన్స్‌పై రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్సై జి.నరేష్ కేసును నమోదు చేయగా రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఇరుసుమండలో విషాద ఛాయలు

అంబాజీపేట: చంద్రశేఖర్ మృత్యువాత పడటంతో ఇరుసుమండలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య రామలక్ష్మి, కుమారులు పవన్, చందు ఉన్నారు. అందరితో కలిసి ఉండే చంద్రశేఖర్ ఇక లేడనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. మృతుని స్వగ్రామం తాడేపల్లిగూడెం మండలంలోని మిలటరి మాధవరం. అయితే 30 ఏళ్ల క్రితం వివాహనంతరం ఇరుసుమండ వచ్చి ఇక్కడే ఉంటున్నారని స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాద దృశ్యం

రాజానగరం: జాతీయ రహదారిపై స్థానిక వైఎస్సార్ జంక్షన్‌లో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగికి చెందిన చవల శ్రీనివాస్ (38) రాగితో తయారు చేసిన ఉంగరాలు, కడియాలను తీర్థాలలోను, గ్రామ గ్రామం తిరుగుతూ అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అవివాహితుడైన అతను తల్లితో కలిసి కొంతమూరులో ఉంటున్నాడు. ఈ క్రమంలో పెద్దాపురంలోని మరిడమ్మ తీర్థంలో రాగి వస్తువులను అమ్ముకునేందుకు తన యాక్టివా స్కూటర్ పై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ అతనిని ఢీ కొని, కొద్దిదూరం బైకుతో సహా ఈడ్చుకుంటూ పోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిని అదే లారీ డ్రైవర్ అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లాడు. అయితే అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కాగా యాక్టివా స్కూటర్‌పై ప్రయాణిస్తూ తలకు హెల్మెట్ ధరించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. కొడుకే ఆధారంగా ఉన్న ఆ వృద్ధ తల్లి అనాథగా మిగిలింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నారాయణమ్మ తెలిపారు.

చోరీకి గురైన నగదు, నగలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు నగలతో ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది


రౌతులపూడి: మండల కేంద్రమైన రౌతులపూడిలో ఇటీవల పేంటి మరియమ్మ ఇంట్లో చోరీకి గురైన రూ.30 వేల నగదు, 30 గ్రాముల బంగారు నగలను స్వాధీన పరచుకున్నట్లు రౌతులపూడి ఎస్సై జి.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన రౌతులపూడికి చెందిన పేంటి మరియమ్మ ఇంట్లో చోరీ జరిగిందని, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేశామన్నారు. ఈ నేపథ్యంలో రౌతులపూడి శివారు మరిడమ్మతల్లి గుడి వద్ద ఇద్దరు బాలుర నుంచి రూ.30వేలు నగదు, 30గ్రాముల బంగారు నగలను స్వాధీన పరచుకున్నట్లు తెలిపారు. బాలురను జిల్లా ప్రొహిబిషన్ అధికారి వద్ద హాజరు పరచామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ డీవీ రమణ, కానిస్టేబుళ్లు బోస్, నూకరాజు, ఉదయ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మందుల దుకాణాల్లో తనిఖీలు


మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న డ్రగ్స్ ఏడీ నాగమణి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో మత్తు, వయాగ్రా మందుల అమ్మకాలు జరుగుతున్న నేపథ్యంలో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో 80 మందుల దుకాణాలకు పైగా తనిఖీ చేసినట్లు డ్రగ్స్ ఏడీ నాగమణి తెలిపారు. దుళ్లలోని శ్రీశ్రీనివాస మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్, శ్రీ మెడికల్స్‌లో డ్రగ్స్ అధికారులు దాడులు చేయగా అక్కడ ఫార్మాసిస్ట్ లేకపోవడం, బిల్లులు లేకుండా అమ్మకాలు చేయడం, షెడ్యూల్ రిజిస్టర్ సరిగా లేకపోవడం, కాలం చెల్లిన మందులు లభించడం కనుగొన్నామన్నారు. వీటితో పాటు మరికొన్ని దుకాణాలు ఇదే విధంగా ఉన్నాయని, వాటన్నింటిపై కేసులు నమోదు చేశామన్నారు.

ఆషాఢంలో ప్రత్యేక బస్సు సర్వీసులు



రామేశ్వరం యాత్ర స్పెషల్ బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ భాస్కరరావు

బోట్‌క్లబ్ (కాకినాడ): ఆషాఢమాసం సందర్భంగా భక్తులకు కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ భాస్కరరావు తెలిపారు. మంగళవారం రామేశ్వరం యాత్ర స్పెషల్ బస్సును ఆయన ప్రారంభించారు. ఈ బస్సు కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పలని, త్రివేండ్రం, కన్యాకుమారి, తిరుచందూరు, రామేశ్వరం, చిదంబరం, కుంభకోణం, తంజావూరు, తిరుత్తని, శ్రీకాళహస్తి దర్శనం అనంతరం కాకినాడ వస్తుందన్నారు. ఆసక్తిగల వారు 73829 10869 నంబర్‌లో సంప్రదించాలన్నారు.